యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్, గూనపాలెంలోని శాంతినికేతన్ జూనియర్ కళాశాలల్లో యువ టూరిజం క్లబ్‌లను శుక్రవారం ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా వీటిని ప్రారంభించారు. ఆయా విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యువజన సర్వీసుల శాఖ మేనేజర్ వి.వి అప్పలనాయుడు, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ డైరెక్టర్ ఎ.రమేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- పల్లెలను స్వయంశక్తి కేంద్రాలుగా మలుచుకుందాం
- వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం రూరల్

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని, అందుకే స్వర్ణ గ్రామసభల పేరుతో జిల్లాలోని 912 పంచాయతీల్లో ఒకేరోజు నిర్వహించి, ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజలతో తీర్మానాలు చేయిస్తున్నామన్నారు. మండలంలోని సానివాడ పంచాయతీలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి హాజరయ్యారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సామాజిక స్పృహతో గ్రామ స్వరాజ్య స్థాపనకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గత వైసిపి ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. పంచాయతీలను బలోపేతం చేయాల్సింది పోయి, వాటి నిధులను మళ్లించిందని ధ్వజమెత్తారు. గ్రామాల్లో ఏ చిన్న పనులు చేయడానికీ, చివరికి వీధిదీపాల నిర్వహణకూ నిధుల్లేని పరిస్థితి కల్పించిందని చెప్పారు. 2019-23 మధ్య రాష్ట్రానికి రూ.40,579 కోట్లు వస్తే వాటిని ఏం చేసిందో తెలియలేదన్నారు. ఉపాధి పనులు, ఇతరత్రా నిధుల ఖర్చుపై సోషల్ ఆడిట్ సరిగా చేయలేదన్నారు. పల్లెలతోనే ప్రగతి ముడిపడి ఉందని, అందులో భాగంగానే కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తోందని చెప్పారు. పల్లెలను స్వయంశక్తి కేంద్రాలుగా మలుచుకుందామన్నారు. రెండేళ్లలో అన్ని గ్రామాల్లో డ్రెయినేజీ, సిమెంట్ రోడ్లు ఉండేలా చేస్తామని స్పష్టం చేశారు. సానివాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఎమ్మెల్యే గొండు శంకర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ మాట్లాడుతూ స్థానిక సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి ఈ గ్రామసభలు దోహదపడతాయన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంతో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలందరూ సమిష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ రుప్ప లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో జిల్లా పరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్రామన్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, వ్యవసాయశాఖ జెడి కె.శ్రీధర్, జెడ్‌పిటిసి రుప్ప దివ్య, ఎంపిటిసి రుప్ప అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆరోగ్య అధికారిగా సుధీర్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్‌గా కింతలి పిహెచ్‌సి వైద్యాధికారి పి.సుధీర్ కుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ వెంకటరావు జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలోని ఇమ్యూనైజేషన్ అధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో ఆయన స్థానంలో సుధీర్ కుమార్ నియమితులయ్యారు.

ప్రతిపాదనలతోనే సరి

- నాలుగేళ్లుగా అడుగు ముందుకు పడని కరకట్టల పనులు
- ముంపు తీవ్రత ప్రాంతాలతో గతంలో పలుమార్లు ప్రతిపాదనలు
- ఎమ్మెల్యేల సూచనలతో తాజాగా మరికొన్ని ప్రాంతాల గుర్తింపు
- మరోసారి కొత్తగా అంచనాలను రూపొందిస్తున్న అధికారులు

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు కొంత ప్రాధాన్యమిస్తున్నా, కరకట్టల నిర్మాణాల విషయంలో మాత్రం పాలకులు చాలా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టిడిపి ప్రభుత్వం కరకట్టల అంచనాలను పెంచిందే తప్ప ఒక్క అంగుళం మేర కూడా పని చేపట్టలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కరకట్టల నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉండడంతో 2019లో పనుల కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేసింది. వాటి స్థానంలో అత్యంత ప్రమాదరకరమైన ప్రాంతాల్లో వరద గట్లు నిర్మించాలని నిర్ణయించింది. అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా వాటిని ఆమోదించలేదు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేల సూచనలతో అధికారులు మరికొన్ని ప్రాంతాలను గుర్తించి, కొత్త అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

నాగావళి వరద ఉధృతికి ఆమదాలవలస మండలం కలివరంలో కుంగిన ఆర్‌బికె భవనం (ఫైల్)

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి నదీ పరివాహక గ్రామాల రక్షణకు గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తాకూస్తో పనులు జరిగినా, ఆ తర్వాత నుంచి ఒక్క అడుగూ ముందుకు పడడం లేదు. కరకట్టల నిర్మాణానికి పెద్దఎత్తున భూమిని సేకరించాల్సి ఉండడం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో, ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు. ముంపు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో, నాగావళి కరకట్టలకు సంబంధించి తొలుత ఐదు ప్రాంతాలను గుర్తించారు.

నాగావళి నదీ పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరాం వద్ద రూ.13.14 కోట్లతో, గంగ్రేడు వద్ద రూ.8.82 కోట్లతో, బెలమాం వద్ద రూ.1.83 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్ట వరకు వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అదే విధంగా వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కిలోమీటర్ల మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నాలుగేళ్ల కాలంలో రెండు, మూడు పర్యాయాలు అధికారులు ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వం కొర్రీలు వేసి వెనక్కి పంపింది.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా...

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులనూ 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితీ అలానే ఉంది. జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్సు సంస్థకు రూ. 61.45 కోట్లకు పనులను అప్పగించారు. 2008లోనే ఆ సంస్థ పనులను ప్రారంభించింది. ఇప్పటికీ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కి.మీ మేర వరద కట్ట నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 17.29 కి.మీ పొడవు మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ ఖర్చు చేసిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ మే 29, 2019న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపివేశారు.

కొత్త ప్రతిపాదనలతో అంచనాలు సిద్ధం చేస్తున్నాం

నాగావళి కరకట్టలపై గత ప్రభుత్వ హయాంలో రెండు, మూడు పర్యాయాలు ప్రతిపాదనలు పంపాం. కరకట్టల నిర్మాణ సర్వే కోసం తాజాగా కొంత డేటా కావాలని అడిగారు. సర్వే కోసం ప్రాథమిక అంచనాలతో ఇటీవల ప్రతిపాదనలు పంపాం. ఆమదాలవలస నియోజకవర్గంలో మరికొన్ని ప్రాంతాలను గుర్తించి కొత్తగా మరోసారి అంచనాలను పంపనున్నాం.

- హెచ్.మన్మథరావు,
ప్రత్యేక కట్టడాల విభాగం ఇఇ

కరకట్టలపై డేటా పంపాం

వంశధార కరకట్టలపై ఉన్నతాధికారుల సూచనల మేరకు ఎప్పటికప్పుడు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నాం. ప్రాథమిక అంచనాలతో ప్రతిపాదనలను గతంలోనే పంపాం. కరకట్టల సర్వే కోసం డేటా కావాలని అడిగితే ఆ వివరాలనూ పంపాం. ప్రభుత్వం ఆమోదిస్తే పనులు ప్రారంభిస్తాం.

- కె.వెంకటేశులు,
ప్రత్యేక పరిశోధన విభాగం ఇఇ

నిర్లక్ష్యంతోనే 'ఎసెన్షియా' ప్రమాదం

యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - రణస్థలం

నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం సంభవించిందని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు విమర్శించారు. 18 మంది కార్మికుల నిండు ప్రాణాలను బలికావడానికి, మరో 45 మంది తీవ్రంగా గాయాలపాలవడానికి కారణమైన యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో కార్మికులకు భద్రత, రక్షణ కల్పించాలన్నారు. ప్రమాద ఘటనకు కారణమైన యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని... ఫార్మా, రసాయన పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు పైడిభీమవరంలో శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు కార్మికుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. యాజమాన్యాలు సరైన భద్రతా చర్యలు పాటించకపోవడం వల్లే తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఫార్మా, రసాయన కంపెనీల్లో తరచూ ప్రమాదాలు సంభవించడం, అమాయక కార్మికులు ప్రాణాలు బలైపోవడం, అనేకమంది వికలాంగులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం సంభవించినప్పుడు ప్రభుత్వాలు, అధికారులు, ప్రజాప్రతినిధులు హడావుడి చేయడం తర్వాత యాజమాన్యాల ఇష్టారాజ్యానికి వదిలేయడంతోనే ప్రమాదాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు చర్యలు, భద్రతా ప్రమాణాలు పాటించడంపై యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. నాశిరకం, కాలంచెల్లిన రియాక్టర్లు, పైపులు వాడడం వంటి లోపాలు అనేక కంపెనీల్లో బయటపడినా వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఈ ప్రమాదాలకు కారణమన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా కంపెనీలు నడుపుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇస్తున్నాయని విమర్శించారు. అందులో పనిచేస్తున్న కార్మికులకు కనీస భద్రత కల్పించడం లేదన్నారు. సేఫ్టీ ఆడిట్ నిర్వహించి వాటి ఆధారంగా ప్రమాణాలు పాటించని కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అనుమతుల రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏ కంపెనీలో ఎప్పుడు ఏ రియాక్టర్ పేలుతుందో, ఏ ప్రమాదం సంభవిస్తుందోనన్న భయాందోళనల్లో కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఉంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగావకాశాల్లేక తమ ప్రాణాలను కంపెనీల లాభాల కోసం ఫణంగా పెడుతున్నారని చెప్పారు. పరిశ్రమల యాజమాన్యాలు లాభాలే పరమావధిగా భావించడం తప్ప కార్మికుల ప్రాణాలకు విలువనివ్వడం లేదని తెలిపారు. గతంలో పరిశ్రమల శాఖ పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తూ భద్రతా ప్రమాణాలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకునేవని గుర్తుచేశారు. నేడు తనిఖీలు లేకపోవడం, నామమాత్రంగా చేయడం, పరిశ్రమల్లో ప్రమాదం సంభవించినా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడంతో యాజమాన్యాలు భద్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలో అరబిందో, సరాకా, శ్రేయాస్ తదితర పరిశ్రమల్లో సంభవించిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో కార్మికులు చనిపోయారని గుర్తుచేశారు. కార్యక్రమంలో డి.ఎల్ నాయుడు, పి.రామకృష్ణ, ఆర్.ఎస్ నాయుడు, సత్యనారాయణ, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి హోంగార్డు మృతి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కాంతారావు మృతదేహం

ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వులో పోలీసు బ్యాండుకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న హోంగార్డు టి.కాంతారావు (48) చెరువులో స్నానానికి దిగి శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా సాయుధ పోలీస్ దళం కార్యాలయం వెనుక ఉన్న మరిడమ్మ తల్లి చెరువు గట్టు వద్ద పరిశుభ్రం చేసేందుకు నలుగురు హోంగార్డులు వెళ్లారు. అనంతరం చెరువులో స్నానానికి దిగారు. కాంతారావు ఈదుకుంటూ చెరువు మధ్యలోకి వెళ్లి తిరిగి రాలేక నీటమునిగాడు. తోటి హోంగార్డులు రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. చెరువు లోతు ఎక్కువగా ఉండడంతో అప్పటికే కాంతారావు కిందకు వెళ్లిపోయాడు. సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో ఎఆర్ డిఎస్‌పి శేషాద్రి, జె.ఆర్ పురం సిఐ అవతారాం, ఎస్ఐ ఎస్.చిరంజీవి ఘటనా స్థలికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లు, అగ్నిమాపక సిబ్బందిని రప్పించి చెరువులో గాలించారు. సాయంత్రం 6.20 గంటల సమయంలో కాంతారావు మృతదేహాన్ని బయటకు తీశారు. మండల కేంద్రంలోని లింగాలపేటలో నివాసముంటున్న మృతునికి భార్య లక్ష్మి, కుమారుడు సత్యనారాయణ, కుమార్తె స్వాతి ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తం

- ప్రతి వాహనం క్షుణ్ణంగా తనిఖీ
- అక్రమ రవాణాను అరికట్టాలి
- ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పాతపట్నం, మెళియాపుట్టి

అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి సూచించారు. పాతపట్నంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుతో పాటు పాతపట్నం, మెళియాపుట్టి, సారవకోట పోలీస్‌స్టేషన్లను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో రికార్డుల నిర్వహణ, పలు ముఖ్యమైన కేసు దర్యాప్తు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం, నాటుసారా, గంజాయితో పాటు నిషేధిత ఉత్పాదకాల అక్రమ రవాణాను అరికట్టే దిశగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి వాహనాల తనిఖీలు విస్తృతంగా చేయాలన్నారు. నాటుసారా తయారీ, విక్రయాల స్థావరాలపై నిరంతరం దాడులు నిర్వహించి పూర్తిస్థాయిలో నాటుసారాని నియంత్రించాలన్నారు. రాత్రి గస్తీ విధులు పటిష్టంగా అమలు చేసి నేర నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, మహిళలు, వృద్ధులపై మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలు తెలుసుకుని త్వరితగతిన సమస్యలని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సిఐ ఎన్.సాయి, ఎస్ఐలు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి - పలాస

ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో పలు సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్‌పి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తానికి 15 ఫిర్యాదులు స్వీకరించగా అందులో 5 భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించి రెండు, శారీరక నేరాలకు సంబంధించి ఒకటి, పరిపాలనకు సంబంధించి ఒకటి, పాత ఫిర్యాదులపై ఒకటి, ఇతర అంశాలపై ఐదు ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలపైనే ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రెవెన్యూ శాఖ పరిధిలో అవి ఉండడంతో ఆ శాఖను సమన్వయం చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఇచ్ఛాపురం, పలాస వంటి దూరప్రాంతాల నుంచి సమస్యలు చెప్పుకునేందుకు ముందుకు రావడం లేదని తన దృష్టికి వచ్చిందని, అందువల్ల కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ప్రతి శుక్రవారం ఫిర్యాదుల స్వీకరించనున్నట్లు తెలిపారు.

కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తన కుమార్తెతో పాటు పలువురు బాలికలను అదే తరగతిలో చదువుతున్న ఒక విద్యార్థి వేధిస్తున్నాడని, ఈ విషయాన్ని హెచ్‌ఎం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోగా, తనపై దురుసుగా ప్రవర్తించారని విద్యార్థిని తండ్రి ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

సర్వే నంబరు 181 పిలో తనకు రెండు ఇళ్ల స్థలాలున్నాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారి డి.శ్రీనివాసరావు వాటిని ఆక్రమించుకుంటున్నారని సోంపేటకు చెందిన కె.జానకిరావు ఫిర్యాదు చేశారు.

రక్తదానానికి ముందుకు రావాలి

యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.వి తిలక్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రక్తదానం చేస్తున్న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు

రక్తదానానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ ఎం.వి తిలక్ పిలుపునిచ్చారు. స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వంద మందికి పైగా ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు బ్యాంకుల ద్వారా సేవలందించడమే కాకుండా సామాజిక బాధ్యతలనూ ఉద్యోగులు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులతో పాటు ఖాతాదారుల భాగస్వామ్యంతో ఈ శిబిరాల ద్వారా అత్యవసర రోగులకు రక్తం అందిస్తున్నామన్నారు. సేవా కార్యక్రమాల్లో ఎప్పుడూ యూనియన్ బ్యాంకు ముందుంటుందన్నారు. రెడ్‌క్రాస్‌లో రక్తనిల్వలు కొరత ఉందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు తెలిపారు. ప్రస్తుతం సీజనల్ జ్వరాల వల్ల ప్లేట్‌లెట్లు పడిపోతున్న నేపథ్యంలో రక్తదానం అవసరం ఉందన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ హెడ్ పి.రవి, ఉద్యోగుల సంఘం నాయకులు బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు ఆంధ్ర కేసరి

ఘనంగా టంగుటూరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

టంగుటూరి చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న డిఆర్ఒ

ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయులని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు అన్నారు. టంగుటూరి జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆయన పేరును ఒక జిల్లాకు పెట్టిందన్నారు. 1940-50వ దశకంలో ఆంధ్రా రాజకీయాల్లో ఆయన కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. తెల్లదొరలను గడగడలాడించిన ధీరునిగా ఖ్యాతిగాంచిన టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర ఉద్యమంలో, స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొని రాజకీయ శక్తిగా ఎదిగి 35 ఏళ్లకే రాజమండ్రి మున్సిపాల్టీకు చైర్మన్‌గా పనిచేశారని చెప్పారు. తన నేతృత్వంలో 'స్వరాజ్య' అనే పత్రికను కూడా నడిపారని తెలిపారు. 1953 అక్టోబరు ఒకటో తేదీన కర్నూలు రాజధానిగా ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారని తెలిపారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోలీసు తుపాకీకి ఎదురొడ్డి నిలిచిన ధీరోదాత్తుడని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. కార్యక్రమంలో బిసి సంక్షేమశాఖ అధికారి అనురాధ, కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధీరత్వానికి టంగుటూరి ప్రతీక : ఎస్‌పి

జిల్లా పోలీసు కార్యాలయంలో టంగుటూరి చిత్రపటానికి ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధీరత్వానికి టంగుటూరి ప్రకాశం పంతులు ప్రతీక అని అన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించారని తెలిపారు. నిరుపేద కుటుంబంలో జన్మించి ఎన్నో సవాళ్లను అధిగమించి ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయిన ధీరోదాత్తుడని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి జి.ప్రేమ్ కాజల్, డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఎఒ గోపీనాథ్, సిఐ దేవుళ్లు, ఆర్ఐ నర్సింగరావు, ఎస్ఐలు, కార్యాలయ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీధుల్లో పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ఆక్రమణలు తొలగించాలి

టెక్కలి: టెక్కలి పట్టణంలో ఉన్న ఆక్రమిత స్థలాల్ని కాపాడు కాపాడుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఇప్పటికే ఆక్రమించుకున్న స్థలాలను ఖాళీ చేయించి సంబంధిత బాధ్యులకు అప్పజెప్పాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పట్టణంలో శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా భవానీ నగర్, అయ్యప్ప నగర్, మండప కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులను సమీక్షించారు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఇప్పుడు ఎటువంటి అభివృద్ధి జరగలేదని, గత పాలకులు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయారని ఆయన అన్నారు. పట్టణంలో చాలా చోట్ల వర్షంనీరు నిలిచిపోవడం, కాలువలు సక్రమంగా లేకపోవడం వంటి వాటిని పరిశీలించిన ఆయన తక్షణమే వాటిని పూర్తి చేయించాలని, సంబంధిత అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఈయనతో పాటు తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, నాయకులు బగాది శేషగిరి, హనుమంత రామకృష్ణ, లవకుమార్, ప్రీతిష్ పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

హైవేపై లైట్లు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండల కేంద్రంలో హైవేపై ప్రధాన కూడళ్ల వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జాతీయ రహదారి నిర్వహణ సంస్థ అధికారులు, జె.ఆర్.పురం సిఐ ఎం.అవతారంతో సమావేశాన్ని నిర్వహించారు. నాతవలస, నరసన్నపేట టోల్‌గేట్ పరిధిలో మెయింటనెన్స్ అధికారులు రామస్వామి, ధవళేశ్వరం, రహదారి నిర్వహణ సంస్థ ఎపిసిఐ ఇన్‌ఛార్జి విజయకుమార్‌లతో సమీక్షించారు. మండల కేంద్రంలో రాత్రి వేళ చీకటిగా ఉంటుందని ఎమ్మెల్యే పరిస్థితి వివరించారు. ఇందుకు సంబంధించి సూర్య స్కూల్, రామతీర్థం కూడలి, సర్విల్ ఆఫీస్, తహశీల్దార్ కార్యాలయ జంక్షన్, పాత పెట్రోల్ బంకు వద్ద స్తంభాలు ఏర్పాటు చేసి నాలుగు వైపుల కనపడేలా లైట్లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరాకు సంబంధిత అధికారులతో మాట్లాడతానని, వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను సూచించారు.

రేపు జెవివి సమావేశం

శ్రీకాకుళం అర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా వార్షిక సమావేశం ఈనెల 25న నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాన్ని వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.రాజగోపాల్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వేదిక జిల్లా అధ్యక్షులు కప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో అధ్యక్షుని తొలి పలుకు, కార్యదర్శి నివేదిక, సభ్యత్వం, జనరల్ ఫండ్, చెకుముకి సైన్సు సంబరాలు, జెవివి సైన్స్ ఎక్స్‌పో, జన విజ్ఞానం, శాస్త్రీయ దక్షత ప్రచారం, విద్యార్థి చెకుముకి పత్రిక, సైన్స్ ఉద్యమ కేంద్రాల కళాశాలల పాఠశాలల గుర్తింపు, భవిష్యత్ కర్తవ్యాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

నివాళ్లర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

మహారాష్ట్ర, కర్నాటక తరహాలో రాష్ట్ర ప్రభుత్వం మూఢనమ్మకాల నిరోధక చట్టం చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు. హేతువాది, శాస్త్రీయ ప్రచార ధృక్పథవాది డాక్టర్ నరేంద్ర దబోల్కర్ వర్ధంతిని నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మూఢనమ్మకాల నిరోధక చట్టం సాధన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నల్లి ధర్మారావు, హనుమంతు సాయిరాం, జిల్లా అధ్యక్షునిగా గొంటి గిరిధర్, ప్రధాన కార్యదర్శిగా కప్పిలి కామేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బి.శ్రీరామమూర్తి, పి.తేజేశ్వరరావు, ఎం. మదన మోహనరావులతో పాటు ఏడుగురిని, కార్య దర్శులుగా 14 మందిని, కార్యవర్గ సభ్యులుగా ఆరుగురిని ఎన్నుకున్నారు.

హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న దానేటి శ్రీధర్

శశిధర్ హాస్పిటల్ ప్రారంభం

శ్రీకాకుళం అర్బన్: అత్యాధునిక సౌకర్యాలతో వైద్య సేవలు జిల్లా ప్రజలకు అందుబాటులోకి రావడం శుభ పరిణామమని ఆ దిశగా డాక్టర్ అన్నెపు శశిధర్ రోగులకు సేవలందించాలని ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద రెవెన్యూ అతిథిగృహం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శశిధర్ హాస్పిటల్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీలతో కలిసి ప్రారంభించారు. రిబ్బన్ కట్ చేసి పలు విభాగాలను ప్రారంభించారు. అనంతరం అతిథులను శాలువాలు కప్పి సత్కరించారు. కార్యక్రమంలో శశిధర్ తండ్రి, న్యాయవాది అన్నెపు సత్యనారాయణ, డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, దువ్వల వెంకటరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు జి.వి.ఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

25న ముత్యం సంతాపసభ

పలాస: మండలం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ఈ నెల 25న ప్రొఫెసర్ ముత్యం సంతాప సభ నిర్వహించనున్నామని జయప్రదం చేయాలని పలువురు ప్రజా సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద శుక్రవారం పోస్టర్ విడుదల చేసి వక్తలు మాట్లాడుతూ తెలుగు సాహిత్య పరిశోధకులు, శాతవాహన విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌గా సుపరిచితమైన ముత్యంకు శ్రీకాకుళం జిల్లాతో ప్రత్యేకంగా ఉద్దానం ప్రాంతంతో, ఈ ప్రాంతంలోని ఉద్యమకారులతో ఆయనకు ఎనలేని అనుబంధం ఉందని, ఆయన మరణం తెలుగు సాహిత్యానికి, చరిత్రకు, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ, లిబరేషన్, పౌరహక్కుల సంఘం, ఇతర ప్రజాసంఘాల నాయకులు వంకల మాధవరావు, పత్తిరి దానేష్, మద్దిల రామారావు, ఢిల్లీరావు, పోలారావు, దుర్యోధన, పిరాసాయి, పావయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామసభలు

కవిటి : మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి వై.వి.ఎం రెడ్డి

రణస్థలం రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

పాతపట్నం : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- కవిటి

మేజర్ పంచాయతీ కవిటిలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభకు జిల్లా సోషల్ వెల్ ఫేర్ డిడి, మండల ప్రత్యేకాధికారి వైవిఎం రెడ్డి, కపాసుకుద్ది పంచాయతీలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎన్.ఆర్.జి.ఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో స్థానిక ప్రజాప్రతినిధులు తమతమ పరిధుల్లో పనులు గుర్తించి నివేదించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళీ మోహన్, ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, డిటి రామచంద్రరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాలం రమేష్, ఆరింగి మధు, పాండవ చంద్రశేఖర్, ఆయా పంచాయతీల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

పోలాకి: మండలంలో 31 పంచాయతీల్లో గ్రామసభలు ప్రశాంతంగా నిర్వహించారు. గుల్లవానిపేట, గుప్పిడిపేట లో తహశీల్దార్ ఎం సురేష్ కుమార్, గంగివలస, చెల్లాయి వలస గ్రామంలో ఎంపిడిఓ ఉషశ్రీ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మావతి, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సూర్య ప్రకాశరావు, ఎపిఒ రమణారావు, ఎపిఎం జి.రాజారావు, పశువైద్య అధికారులు, జెఇఇలు, వెలుగు సిసిలు, కార్యదర్శుల, విఆర్ఒలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని పెద్ద లక్ష్మీపురం గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభకు ఎంపిడిఒ పడాల చంద్రకుమారి హాజరయ్యారు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బి.ఉదయ్ కుమార్, మాజీ సర్పంచ్ బి.లలిత కుమారి, సచివాలయ కార్యదర్శి ఎస్.వి.ప్రసాద్, విఆర్ఒ అన్నాజీరావు, డిజిటల్ అసిస్టెంట్ బమ్మిడి కిరణ్ కుమార్, ఢిల్లీరావు, తిరుపతిరావు, శశిభూషణరావు, వంజంగి రమేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో భావనపాడు, మర్రిపాడు నౌపడ, యామల పేట, డీజీపురం తదితర పంచాయతీల్లో గ్రామ సభలు ప్రశాంతంగా జరిగాయి. కార్యక్రమంలో నాయకులు జీరు భీమారావు, సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి, కర్రి విష్ణుమూర్తి, వాడరేవు కృష్ణ, తులసీదాసు, అట్టాడ కల్పనా రాంప్రసాద్, ముదీలి సంజీవ్, భాస్కరరావు పాల్గొన్నారు.

సంత బొమ్మాళి: మండలంలోని పలు గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. వివిధ పనులను గుర్తించారు. కార్యక్రమంలో కార్యదర్శులు గణపతి, విద్య, మల్లేశ్వరరావు, ఢిల్లేశ్వరరావు, రామారావు, ప్రత్యేకాధికారులు ప్రేమలీల, ఉమా సుందరి, అప్పారావు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.రాజారావు, ఎపిఒ ఎం.నాగరాజు, ఎపిఎం జాంభవతి, మండల ఇంజనీరింగ్ అధికారి సంతోష్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్ మధు, హౌసింగ్ ఎఇ దినేష్, ఎంఇఒలు నరసింహులు, చిన్నారావు, సిసిలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని 33 పంచాయతీల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేష్ కుమార్ పాల్గొన్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్సేన్ ఆధ్వర్యంలో తాళ్లవలసలో గ్రామసభ నిర్వహించారు.

రణస్థలం రూరల్: మండలంలోని వేల్పురాయిలో సర్పంచ్ బాలి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లోకేష్, ఎపిఒ శ్రీనివాస్‌నాయుడు, సెక్రటరీ, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: పాతపట్నం, కాగువాడ, గంగువాడ సచివాలయాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలో 21 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యమ్రకంలో ఎంపిడిఒ ఈశ్వరరావు, ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని 30 పంచాయతీలకుగాను 29 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. లక్కుపురం గ్రామ సభలో ఎంపిపికర్నెన దీప ఆధ్వర్యంలో జరిగింది. మునసానపుట్టి పంచాయతీ కోర్టులో ఉండడంతో ఎంపిడిఒ వివరించారు.

కొత్తూరు: మండలంలోని 43 పంచాయతీల్లో రోడ్లు, కాలువలు, వివిధ రకాల పనులను గ్రామసభల్లో గుర్తించారు. కొత్తూరు గ్రామసభ సర్పంచ్ పడాల కృష్ణవేణి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాద్, మండల ప్రత్యేకాధికారి అన్నదొర, ఎంపిడిఒ ఎం.పావని, ఎఒ బి.రాంబాబు, కార్యదర్శి జానకి స్వరూప, ఎంపిటిసిలు టి.తిరుపతిరావు, జి.ఆనందరావు, గోగుల వరప్రసాదరావు నాయుడు, లక్ష్మణరావు, ఎల్. జనార్ధన, జె.మహాలక్ష్మి పాల్గొన్నారు.

సోంపేట: మండల పరిధిలోని 23 పంచాయతీల్లో గ్రామసభలు జరిగాయి. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారితో పాటు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొందూరు: మండల కేంద్రంలో సర్పంచ్ ఆర్.లక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, హౌసింగ్ పిడి నగేష్, టిడిపి అధ్యక్షులు రామ్మోహన్, జనసేన నాయకులు పిసిని చంద్రమోహన్, పేడాడ రామ్మోహన్, చినరంగ, బాడాన గిరి, కాకర్ల రాజారావు, శ్రీనివాసరావు, ఎంపిడిఒ హరిహరరావు, ఇఒ రమేష్ పాల్గొన్నారు.

జి. సిగడాం: మండలంలో అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఎం.నారాయణరావు, టిడి వలసలో ఎఫ్ఎం రెడ్డి రామకృష్ణ నాయుడు, బాతువాలో ఎంపిడిఒ నిశ్చల, కూటమి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కంచిలి: మండలంలో అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని బూరగాం గ్రామసభలో మండల ప్రత్యేక అధికారి, పశుసంవర్ధక శాఖ జెడి వి.జయరాజ్, కంచిలి, కొల్లూరు తదితర సభల్లో ఉపాధి ఎపిడి సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపిడిఒ నీరజ, ఎమ్మెస్ పల్లి సభలో ఉపాధి ఎపిఒ ధనంజయంతో పాటు ఆయా పంచాయతీల పరిధిలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పలాస: మండలంలోని 16 సచివాలయాల్లో గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భగా లొద్దభద్ర సచివాలయ గ్రామ సభలో ఎంపిడిఒ పాల్గొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయ ప్రత్యేక అధికారులు,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: మండలంలో 30 గ్రామపంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. వంజంగిపేట పంచాయతీలో జరిగిన గ్రామసభలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు పాల్గొన్నారు. మండలంలోని బొబ్బిలిపేటలో సర్పంచ్ గొండు రమణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. చింతలపేటలో సర్పంచ్ ప్రతినిధి నేతింటి జ్యోతి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు

ఇచ్ఛాపురం : చంద్రయాన్ నమూనా తయారు చేసిన విద్యార్థినులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జ్ఞానభారతి స్కూల్‌లో శుక్రవారం జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలను పాఠశాల సెక్రటరీ, సిఇఒ జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోహార్ ఖాన్ మాట్లాడుతూ భారతదేశం సాధించిన అంతరిక్ష విజయాలను వివరించారు. చంద్రియాన్-3 నేరుగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై ఆగస్టు 23న ల్యాండ్ అయిందని, దక్షిణ ధ్రువంపై కాలు పెట్టిన మొదటి దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించిందన్నారు. చంద్రయాన్-3 ప్రయోగంలో పాల్గొన్న సైంటిస్టులు అందరూ భారతీయులేనని, ప్రతి విద్యార్థి సైంటిస్ట్ కావాలని ఆకాంక్షించారు. ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఇందు భూషణ్ పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా తదితరులు మాట్లాడుతూ చంద్రయాన్-3 ప్రయోగం వెనక ఉన్న ఉద్దేశాలను వివరించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థి జితిన్ ల్యాండ్ రోవర్ నమూనాను తయారుచేసి ప్రదర్శించి, ఎలా పనిచేస్తుందో వివరించి, అందరి అభినందనలు అందుకున్నాడు. కార్యక్రమంలో మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్‌ఫోర్ట్ మేనేజర్ అలీం ఖాన్, పిఇటిలు కైలాష్ పండా, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

పలాస: మండలం బ్రాహ్మణతర్లా హైస్కూల్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఉన్న చంద్రయాన్ -3 ల్యాండర్ పెయింటింగ్ వద్ద జాతీయ జెండాలతో జై విజ్ఞాన్, జై భారత్ అంటూ ఉపాధ్యాయులు, విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.వి.రమణారావు, సైన్స్ ఉపాధ్యాయులు కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, పద్మ, చంద్రశేఖర్, శివప్రసాద్, మెహర్ సుధ, కృష్ణవేణి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: జాతీయ స్పేస్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ అధ్యాపకులు సిహెచ్ రాంబాబు, కో-ఆర్డినేటర్, వి.లూక్‌పాల్, నూక రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సూర శ్రీను జన్మదిన వేడుకలు

శ్రీకాకుళం అర్బన్: ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు అధినేత డాక్టర్ సూర శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలుచోట్ల చేపట్టిన సేవా కార్యక్రమాల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం తోటపాలెం అంబేద్కర్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి దాహార్తిని తీర్చేందుకు ట్యాంకరు అందజేశారు. గతంలో తన సొంత నిధులతో నిర్మించిన రచ్చబండను ప్రారంభించారు. డేఅండ్‌నైట్ కూడలిలో ఆటోడ్రైవర్లకు టీ షర్టులను అందజేశారు. పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని భవనం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు మూడు వేల మందికి మహిళలకు చీరలు, తువ్వాళ్లను పంపిణీ చేశారు.

కేక్ కట్ చేస్తున్న సూర శ్రీను

చింతాడ మంజు రాజీనామా

టెక్కలి రూరల్: వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న చింతాడ మంజు పదవికి రాజీనామా చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాజీనామా లేఖ పంపించినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల ఈ పదవికి రాజీనామా చేసినట్లు ఆమె తెలిపారు.

లక్ష్యాలను అధిగమించాలి

బూర్జ: ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల లక్ష్యాన్ని అధిగమించాలని ప్రత్యేకాధికారి సాయిప్రసాద్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వంద రోజుల లక్ష్యం కార్యక్రమం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇఎఎస్ గృహాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, గృహ నిర్మాణ శాఖ ఎఇ లక్ష్మీనారాయణ, వర్క్ ఇన్‌స్పెక్టర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు : పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఎయిడ్స్ మహమ్మారిపై అవగాహన పెంచుకోవడం ద్వారా దాని నివారణ సాధ్యమవుతుందని ప్రాజెక్టు డైరెక్టర్ రాంప్రసాద్ అన్నారు. శుక్రవారం దేవునల్తాడలో కేర్ అండ్ సపోర్ట్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజలకు మీకుతెలుసా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎయిడ్స్‌పై సమాచారం, అవగాహన కౌన్సిలింగ్‌లో భాగంగా జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి సూచనలు మేరకు ప్రభావిత గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. హెచ్ఐవి ఎయిడ్స్‌పై ఉన్న అపోహలు, అనుమానాలపై

అవగాహనతో ఎయిడ్స్ నివారణ

ప్రజలకు అవగాహన కల్పించారు. గెస్ట్ సంస్థ సహకారంతో సిబిఎస్ క్యాంపు నిర్వహించి 50 మందికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో నేతల లక్ష్మణ, అవుట్ రీచ్ సిబ్బంది ఎస్.వెంకటేష్, గెస్ట్ సంస్థ సిబ్బంది దుప్పల రాణి, నిరంజన్, సర్పంచ్ బి.వరదారాజులు, ఎంపిటిసి వెంకన్న, టిడిపి నాయకులు కృష్ణ, అప్పాజీ, ఎఎన్ఎం, అంగన్వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఎపి స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం సంయుక్తంగా ఎంపిక చేయబడిన గ్రామాల్లో మీకు తెలుసా అవగాహన ప్రోగ్రాంలో భాగంగా హెచ్ఐవిపై జిల్లా రిసోర్స్ పర్సన్ హనుమంతు నాగభూషణరావు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరాజు నాయుడు, స్థానిక దిశ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. బి.రేవతి, సిఎఫ్ఐ జోనల్ సూపర్‌వైజర్ చింతాడ ప్రసాద్, దివ్వల మల్లేశ్వరరావు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి- పలాస

మందస : ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో, ఆస్పత్రుల్లో మహిళా వైద్యుల, నర్సుల, ఉద్యోగుల రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని, బెంగాల్ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ మౌనిత హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలిని ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కాశీబుగ్గ సూది కొండ ప్రాంతంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు మాట్లాడుతూ 36 గంటలు పాటు విధులు నిర్వహించి, విశ్రాంతి కోసం వెళ్లిన ఆమెపై ఆస్పత్రి ఆవరణలో దురాగతానికి పాల్పడ్డారంటే మహిళల భద్రత ఎంత ప్రశ్నార్ధకంగా వుందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మహిళా సంఘం కార్యదర్శి బి.నాగమణి, లక్ష్మి, బానమ్మ, చింతల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మందస: మండలం హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిపురం విద్యార్థులు హెచ్ఎం జి.ఉమారాజ్ ఆధ్వర్యంలో బెంగాల్ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ మౌనిత హత్యాచార ఘటనపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మౌనిత అత్యాచార ఘటన సమాజానికి సిగ్గుచేటని, ప్రభుత్వం తక్షణమే స్పందించి నిందితులకు కఠిన శిక్ష విధించాలన్నారు. ఈ ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకొర సేవలకే పరిమితం

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో ముఖ్యమైన ప్రజాప్రతినిధులు ఉన్న కేంద్రం మబగాం పంచాయతీ. ఈ గ్రామంలో ఉన్న పశువైద్య కేంద్రంలో సిబ్బంది లేక అరకొర సేవలకే పరిమిత మవుతుంది. ఈ పశువైద్య కేంద్రంలో పరిధిలో 8 వేలు వరకు పాడి పశువుల, మేకలు, గొర్రెలు, కోళ్లు ఇలా రకరకాల జీవరాశులు ఆధారపడి ఉన్నాయి. అలాగే మబగాం, మబగాం కాలనీ, కత్తిరివానిపేట, కిల్లాం, గజపతి నగరం, ఖాన్ సాహెబ్‌పేట, వనితమండలం తదితర గ్రామాలు నుంచి పశు వులను తెస్తుంటారు. అయితే ఇక్కడ మాత్రం డెప్యుటేషన్‌పై పశువైద్యాధికారి పనిచేస్తున్నారు. వారానికి ఒకటి రెండుసార్లు వచ్చి పశువులకు వైద్య పరీలు నిర్వహిస్తుంటారు. అలాగే వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబ్‌ఆర్డినేట్ రెండు పోస్టులు రెండేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి. ఈ పశువైద్య కేంద్రం కోసం పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు వాపో తున్నారు. ఏదైనా సమవేశానికి వెళ్లినా, వ్యక్తిగత పనుల నిమిత్తం సెలవు పెట్టిన ఆస్పత్రి ఆరోజు సెలవే. ఆ రోజు పశు వైద్య కేంద్రానికి ఎంత దూరం నుంచి పశువుల తెచ్చినా తిరిగి తోలుకొని వెళ్లాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి సిబ్బందిని నియ మించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి ఎం.మల్లేశ్వరరావు దగ్గర ప్రస్తావించగా, ఈ పశువైద్య కేంద్ర పరిధిలోని గ్రామాలన్నీ దూరంగా ఉన్నాయన్నారు. రైతులు ఫోన్ చేసి రమ్మని పిలుస్తారని, తప్పనిసరి పరిస్థితిలో వెళ్లాల్సి వస్తోందని తెలిపారు.

పశువైద్య కేంద్రం

పురుగుల మందు తాగి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కల్లాడ పంచాయతీ మదనాపురానికి చెందిన భద్రాచలం ముకుంధరావు (75) పురుగుల మందు సేవించి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ముకుంధరావు నిత్యం మద్యం సేవిస్తాడని, గురువారం కూడా మద్యం సేవించి రాత్రి సమయంలో తాగునీరు అనుకుని సమీపంలో ఉన్న గడ్డి మందు బాటిల్ తీసుకొని తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ముకుందరావును టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య ఆరుద్రమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని భార్య ఆరుద్రమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి- సోంపేట

జయరాం (ఫైల్)

మండలంలోని పొత్ర కండకు చెందిన రట్టి జయరాం (37) సచివాలయ ఉద్యోగి గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, బారువ పోలీసులు తెలిపిన వివరాల మేరకు పొత్రకండకు చెందిన జయరామ్ ఉద్యోగరీత్యా కొర్లంలో భార్య శోభారాణితో కలిసి నివాసం ఉంటున్నాడు. వీరికి వివాహమై ఏడాదికాగా ప్రస్తుతం అతడి భార్య 9 నెలల గర్భిణి. జై రామ్ వ్యక్తిగత పనిపై గురువారం సాయంత్రం కొర్లం నుంచి స్వగ్రామానికి వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా శారదాపురం మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు బలమైన గాయమైంది. జయరాం కోమాలోకి వెళ్లిపోవడంతో గుర్తించిన స్థానికులు సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బారువ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

బావి వివాదంలో కోర్టు తీర్పు

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రం వెంకటేశ్వర కాలనీలో పంచాయతీకి, వావిలపల్లి సుజాత అనే మహిళలకు బావి స్థలం వివాదంలో కోర్టులో పొందూరు మేజరు పంచాయతీకి అనుకూలంగా తీర్పు వెలువడినట్లు శు క్రవారం ఇఒ ఎస్.రమేష్ తెలిపారు. 2016 ఆగష్టు 15న వావిలపల్లి సుజాత పంచాయతీ స్థలాన్ని ఆక్రమించడంతో పాటు, స్థలంలో ఉన్న బావిని కొంతమంది వ్యక్తుల సహాయంతో కూల్చివేశారు. కాలనీకి తాగునీరందించే బావిని కూల్చడంపై కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు పంచాయతీ సిబ్బంది ఆక్రమణను అడ్డుకున్నారు. దీనిపై ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసును నమోదుచేసిన పోలీసులు కేసును కోర్టుకు అప్పగించారు. దీనిపై వాదోపవాదనలు జరిగాయి. స్థలం పంచాయతీకి చెందినదిగా గుర్తించి జడ్జి పంచాయతీకి అనుకూలంగా తీర్పు వెలువరించారు. కోర్టు ఖర్చులతో పాటు అప్పటి పంచాయతీ ఇఒ మోహన్‌బాబుకు రూ.3 వేలు చెల్లించాలని తీర్పు ఇచ్చారు. ఇదే కేసులో కాలనీకి చెందిన కొంతమందిపై సుజాత వేసిన కేసులను జడ్జి కొట్టివేసినట్లు ఇఒ తెలిపారు.

ఆమదాలవలస : చెక్కును అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

మృతుల కుటుంబాలకు చెక్కు అందజేత

ప్రజాశక్తి- ఆమదాలవలస

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఫార్మా కంపెనీ పేలుడు ఘటనలో మృత్యువాత పడిన పైడి రాజశేఖర్ కుటుంబానికి నష్ట పరిహార చెక్కును గురువారం రాత్రి రెవిన్యూ అధికారులు అందించారు. మండలంలోని వంజంగికి చెందిన రాజశేఖర్ ఫార్మా కంపెనీ పేలుళ్లలో మృతి చెందిన విషయం విదితమే. శుక్రవారం వేకువ జామున వంజంగిలో అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండల తహశీల్దార్ డి.రమేష్‌బాబు రాజశేఖర్ తల్లిదండ్రులకు రూ.కోటి చెక్కును అందజేశారు. ప్రమాద ఘటనలో మృతి చెందిన ప్రతి కుటుంబానికి సిఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన రూ.కోటి చెక్కులను మృతుల అంత్యక్రియల అనంతరం వారి స్వగ్రామాల్లో రెవిన్యూ అధికారులు అందించారు.

పొందూరు: పొందూరుకు చెందిన హంస ప్రశాంత్ కుటుంబానికి ప్రభుత్వం ప్రకటించిన రూ.కోటి చెక్కును అందించారు. పొందూరులోని ప్రశాంత్ నివాసంలో తహశీల్దార్ రమేష్ ప్రశాంత్ భార్య జ్యోతికి చెక్కును అందించారు. తహశీల్దార్‌తో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు, విఆర్ఒ రేవతిరావు ఉన్నారు.

అక్రమ ఇసుక వాహనాలు సీజ్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నాగావళి నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఆక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను శుక్రవారం సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు నాగావళి నది అవతలవైపున ఉన్న మండలంలోని నెల్లిమెట్ట గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారు జామున అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో దాడి చేసినట్టు తెలిపారు. ఈ దాడిలో చిలకపాలెంకు చెందిన ఇసుకతో ఉన్న లారీ, మరో ఖాళీ లారీతో పాటు రెండు ట్రాక్టర్లు, ఒక జెసిబిను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వాహనాలతో అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్న వ్యక్తులను విచారించగా వారి వద్ద ఎటువంటి అనుమతి పత్రాలు లేవని రుజువు కావడంతో కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యాపారులదే పార్కింగ్ బాధ్యత

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో వ్యాపారస్తులు తమ షాపులకు వచ్చే కొనుగోలుదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పించాలని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ సూచించారు. శు క్రవారం టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య వస్తుందన్నారు. వ్యాపారులు షాపుల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. రద్దీ లేని సమయంలో లోడింగ్, అన్ లోడింగ్ చేసుకోవాలన్నారు.

కళింగపట్నం టవర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పరిశోధనలపై ఆసక్తి పెరగాలి

ప్రజాశక్తి - గార

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి కలిగించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పోర్టు కళింగపట్నం లైట్‌హౌస్ అధికారులు, కోకా వారి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బహుమతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రయాన్-3 విజయానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అన్ని పాఠశాలలు, డైట్ కాలేజీల్లో విద్యార్థులతో పాటు యువకుల్లో అంతరిక్ష పరిశోధనలపై ఆసక్తి పెంచేందుకు గానూ పలు కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించిందని వివరించారు. అనంతరం లైట్‌హౌస్‌ను సందర్శించారు. ఎమ్మెల్యే వెంట కోస్ట్‌గార్డు అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్‌టి కమిషన్ ఎదుట కలెక్టర్

ప్రజాశక్తి - టెక్కలి

మండలంలోని లింగాలవలస పంచాయతీ పరిధిలోని సన్యాసిపేటకు చెందిన భూ వివాదంపై ఢిల్లీలోని జాతీయ ఎస్‌టి కమిషన్ ఎదుట కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం హాజరయ్యారు. సన్యాసిపేటకు చెందిన రైతుల చిన్నారావు, నాగేశ్వరరావుకు చెందిన భూ వివాద సమస్య దశాబ్ద కాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీనిపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు వాబ యోగి జాతీయ ఎస్‌టి కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఢిల్లీలోని కమిషన్ ముందు కలెక్టర్, రైతులు, ఫిర్యాదుదారులు హాజరై తమ వాదనలు వినిపించారు.

ఎస్‌ఎంసి వైస్ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి- బూర్జ

పాఠశాల హెచ్‌ఎం తీరుతో స్కూల్‌కమిటీ వైస్ చైర్మన్ రాజీనామా చేసిన సంఘటన చోటు చేసుకుంది. ఇటీవల మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ స్థాయిలో స్కూల్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఇందులో భాగంగా తోటవాడ ప్రాథమిక పాఠశాలలో వైస్ చైర్మన్‌గా పొట్నూరు వెంకటేష్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అయితే పాఠశాల హెచ్‌ఎం తనను పలు పనులకు ఉపయోగించుకుంటున్నారని వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల సంతకాలు తీసుకురమ్మని పుస్తకం ఇచ్చారని, నా ఆరోగ్యం బాగోలేదని, ఇలాంటి పనులు నేను చేయలేనని చెప్పానని వెంకటేష్ తెలిపారు. అయినప్పటికీ హెచ్‌ఎం చేసి చేరాల్సిందేనని చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో సంతకాలు తీసుకున్నానని చెప్పారు. దీంతో తన పదవికి రాజీనామా చేసినట్టు వెంకటేష్ వివరించారు. వైస్ చైర్మన్‌తో ఇటువంటి పనులు చేయించడం ఎంతవరకు సమంజసం అని వెంకటేష్ ప్రశ్నించారు. ఇదే విషయాన్ని ఎంఇఒ ధనుంజయరావును వివరణ కోరగా ఇందులో పెద్ద విషయం ఏముందన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పాతపట్నం నుంచి మెళియాపుట్టి మీదుగా పలాస వరకు ఉన్న ఈ రహదారి పాడైపోవడంతో పాటు రహదారికి ఇరువైపుల ఉన్న మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడడం వలన ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి సమస్యలను పరిష్కరించాలని వైసిపి నాయకులు బి.నారాయణమూర్తి అన్నారు. ఈ సమస్య పరిష్కారానికి రాజకీయ కోణంలో కాకుండా సామాజిక కోణంలో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్‌అండ్‌బిం అధికారులు స్పందించి పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

విద్యాప్రమాణాలు మరింత మెరుగుపడాలని ఎంఇఒ-2 మల్లారెడ్డి పద్మనాభరావు అన్నారు. శుక్రవారం మండలంలోని నడసంద్ర పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా 1, 2 తరగతి విద్యార్థులకు లాంగ్వేజ్ అండ్ లిటరసి డెవలప్‌మెంట్‌కు సంబంధించి అభినయ గేయాన్ని హావభావాలతో నేర్పించారు. అలాగే కాగ్నిటివ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి విద్యార్థులచే జట్టు నృత్యాలు చేయించారు. అనంతరం టీచ్ టూల్ ట్రైనీ, గణిత ఉపాధ్యాయులు రామలక్ష్మి పదాలు డిక్టేట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. విద్యా ప్రమాణాలు మరింత మెరుగు పడాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. ఈయనతో పాటు హెచ్‌ఎం రమేష్ చౌదరి, అంజనా దాస్ తదితరులు ఉన్నారు.

టంగుటూరి నేటితరానికి స్ఫూర్తి

కవిటి : చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- కవిటి

టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఎంపిడిఒ కార్యాలయం, కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిని ఎదిరించి పోరాడిన ప్రకాశం పంతులును యువత, విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, కల్యాణి ఆంగ్ల పాఠశాల ఎఒ బి.రాణి, బల్లెడ రమేష్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఠాగూర్ సాయికి ప్రథమ బహుమతి లభించింది. గ్రంథాలయం తరుపున ఆయనకు బహుమతులు అందజేశారు.

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ టి .నాగేంద్ర కుమార్, తహశీల్దార్ బి.సత్యం, రెవిన్యూ మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి నిర్వహించారు. టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆమదాలవలస: బొడ్డేపల్లి పేట వద్ద నున్న గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి అన్నెపు కోటేశ్వరరావు టంగుటూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సంతోష్ తదితరులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

శ్రీకాకుళం అర్బన్: టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నగరంలో పలు చోట్ల నిర్వహించారు. డిఆర్‌డిఎ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ప్రాజక్టు డైరెక్టర్ పి. కిరణ్‌కుమార్ పూలమాల వేసి అంజలి ఘటించారు. అలాగే గాంధీ మందిరం జరిగిన కార్యక్రమంలో నిర్వహకులు ఆయన విగ్రహానికి నివాళ్లర్పించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పూలమాల వేసి నివాళ్లర్పించారు. డిఆర్‌డిఎ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎఒ దొర, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గాంధీ మందిరంలో నిర్వహకులు హరనాథ్, జామి బీమశంకరరావు శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పివి భాస్కర రాజా, విశ్రాంత జూనియర్ అసిస్టెంట్ చిరంజీవులు, ప్రత్యూష, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్

లావేరు : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు

విద్యార్థికి అందజేస్తున్న సైకిల్

విద్యార్థికి సైకిల్ అందజేత

పొందూరు: మండలంలోని పిల్లలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దూరం నుంచి వచ్చి చదువుతున్న నిరుపేద విద్యార్థి సీపాన సందీప్‌కు పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు మేడూరి వాసుదేవరావు శుక్రవారం సైకిల్‌ను బహుకరించారు. పాఠశాలకు దూర ప్రాంతం నుంచి వస్తున్న విద్యార్థులకు లాటరీ ద్వారా ఎంపిక చేసి ఈ సైకిల్‌ను బహుకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుగ్గు కాసులుబాబు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

లావేరు: మండలంలోని పెదరావుపల్లి పంచాయతీ వైసిపి నాయకులు పెద్ది అప్పారావును ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ శుక్రవారం పరామర్శించారు. అప్పారావు కాలుకు ఇటీవల శస్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, వైసిపి నాయకులు ఆరంగి శ్రీరామూర్తి, పెద్ది చిరంజీవి, సత్తిబాబు, ఆదినారాయణ తదితరులున్నారు.

భవిత కేంద్రం పరిశీలన

సంత బొమ్మాళి: సంతబొమ్మాళి భవిత కేంద్రాన్ని జిల్లా సాహిత్య విద్య సమన్వయకర్త బుడుమూరు గోవింద రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను ప్రశ్నిస్తూ ఇక్కడ ఏ విధంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బోధన జరుగు తుంది, వారికి అందుతున్న ఉపకరణాలు, ప్రభుత్వం కల్పిస్తున్న సేవలు ఏ విధంగా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియో థెరపీ, రికార్డులను పరిశీలించారు. ఐఇడి టీచర్స్ భాస్కరరావు, అచ్యుతరావు, ఉపాధ్యాయులు రాంబాబు పాల్గొన్నారు.

యువతరం సేవాసమితి ఆర్థికసాయం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పేదరికంతో బాధ పడుతున్న పుట్ట లక్ష్మి కుమార్తె గౌతమి పెళ్లి ఖర్చుల కోసం యువతరం సేవాసమితి సభ్యులు ఆర్థికసాయం అందించారు. శుక్రవారం గోవిందపురంలో లక్ష్మి ఇంటికి వెళ్లి కుమార్తె గౌతమి పెళ్లి ఖర్చుల కోసం రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. గౌతమీ తన తల్లి కడుపులో ఉన్నప్పుడే ఆమె తండ్రి ఇంట్లో పాము కాటుకు గురై మృతి చెందాడు. చిన్న తనం నుంచి చాలా పేదరికంతో బాధ పడుతున్నారు. తల్లి భవన నిర్మాణ కార్మికురాలుగా పని చేస్తూ పోషిస్తుంది. కుమార్తె పెళ్లి ఖర్చులు ఆర్థిక భారంగా మారడంతో ఆమె దాతల సహకారం కోరింది. విషయం తెలుసుకున్న యువతరం సేవా సమితి ముందుకొచ్చి ఆర్థికసాయం అందించింది. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షులు చింత మురళి, ఇన్‌ఛార్జిలు గొరకల సునీల్, బత్తిని విఘ్నేష్, కోడి నిహాల్, అన్నెపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

లింగ నిర్ధారణ నేరం

ఆమదాలవలస : గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు డి. సురేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులకు గర్భస్థ లింగ నిర్ధారణపై అవగాహన కల్పించారు. అనంతరం అక్కడ నుంచి సచివాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో ఆడబిడ్డలను రక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఆడపిల్లలకు మంచి చదువును అందిస్తే వారు సమాజంలో అన్ని రంగాల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ భూలక్ష్మి, ఫార్మసిస్ట్ చింతాడ వరుణ్ కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, రాజా, రమేష్, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నగరంపల్లి గ్రామస్తుల ఔదార్యం

వజ్రపుకొత్తూరు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సింహాద్రి సురేష్ కుటుంబంపై నగరంపల్లి గ్రామస్తులు తమ ఔదార్యం చూపించారు. శుక్రవారం గ్రామ పెద్దలు పలాసలో ఉంటున్న మృతుని భార్య భాగ్యలక్ష్మి, పిల్లలు సందీప్, సాత్విక్‌లను కలిసి గ్రామం తరపున రూ.54,601 నగదును వారికి అందజేశారు. మృతుడు కుటుంబం గతంలో నగరంపల్లిలో నివసించేవారు. మృతి వార్త తెలుసుకున్న నగరంపల్లి గ్రామ ప్రజలు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకుని తమవంతు సాయం అందించడానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ సురేష్ మంచి వ్యక్తి అని ఆయన మరణం దురదృష్టకరమన్నారు. గ్రామస్తులు చూపిన ఔదార్యానికి మృతుని భార్య కృత్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిస్తు మనోజ్, బమ్మిడి లక్ష్మీపతి, సంపత్‌రావు ప్రసాద్, కొరికాన రవి, బంగారి శంకర్, చిరంజీవి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నగరంపల్లి గ్రామస్తులు

లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ప్రజాశక్తి- పలాస

గృహ నిర్మాణశాఖలో ఇళ్ల నిర్మాణంపై లక్ష్యాన్ని పూర్తి చేయాలని తహశీల్దార్ బి.సత్యం అన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో గృహ నిర్మాణశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన హౌసింగ్ పథకంలో భాగంగా ఇళ్ల నిర్మాణాలు త్వరతగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను అదేశించారు. బిల్లులు అప్‌లోడ్ చేసి త్వరగా బిల్లులు చెల్లించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, హౌసింగ్ ఎఇ రాజమోహన్, ఆర్‌ఎ నిరంజన్, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు రక్తదాన శిబిరం

ఆమదాలవలస: పట్టణంలోని ఎస్‌ఎస్‌ఎన్ కళ్యాణ మండపంలో ఈ నెల 25న ఆదివారం నిర్వహించనున్న రక్తదాన శిబిరాన్ని ప్రతిఒక్కరూ జయప్రదం చేయాలని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్, చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) కోరారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు.

న్యాయం చేయాలి

పాతపట్నం: అక్టోబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి వస్తుందని వివిధ పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో విధులు నిర్వహిస్తున్న సుమారు 15 వేల మంది ఉద్యోగాలకు భద్రత కల్పించాలని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్లు శుక్రవారం మద్యం దుకాణం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. ప్రభుత్వం మద్యం పాలసీ మార్పు చేస్తే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించి వేరే శాఖలో ఉద్యోగాలు ఇప్పించాలని, లేదంటే తమ కుటుంబాలు రోడ్డున పడతాయని వారు ప్రభుత్వాన్ని కోరారు.

సత్కారం చేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆత్మీయ సత్కారం

కవిటి: నెదర్లాండ్స్, స్విట్జర్లాండ్, బెల్జియం, లగ్జంబర్గ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలు పర్యటించి గురువారం స్వదేశం చేరుకున్న కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావును స్థానిక ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది శుక్రవారం ఆత్మీయ సత్కారం చేశారు. విదేశీ పర్యటనల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద బాలికలకు ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: మండలం పూడి జగన్నాథపురానికి చెందిన తిమ్మల అప్పలస్వామి కొంతకాలంగా అనారోగ్యం బారినపడి ప్రాణాలు కోల్పోయారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు వైశాలి, వినీత ఉన్నారు. విషయం తెలుసుకున్న అమెరికాకు చెందిన విఫర్‌నీడ్ సంస్థ ఆ కుటుంబానికి రూ.20 వేలు ఆర్థికసాయంగా అందజేశారు. ఆ మొత్తాన్ని మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ వల్లెవలస సభ్యులు అందించారు. పిల్లల చదువుల విషయంలో ఏ అవసరం ఉన్నా మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. రెడ్డి సూరిబాబు, గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్న, అరవింద్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వసతిగృహం తనిఖీ

ఇచ్ఛాపురం: మండలంలో కోలిగాం పంచాయతీలో ఉన్న వసతిగృహాన్ని తహశీల్దార్ వెంకటరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతిగృహ నిర్వహణ తీరుతెన్నులు పరిశీలించారు. వసతిగృహంలో మరుగుదొడ్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు అందు బాటులో వార్డెన్ ఉండాలని, హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తెప్పవన్నారు. ఈయన వెంట వసతిగృహ సిబ్బంది ఉన్నారు.